క్లుప్తంగా

విద్యతో ఉన్నత స్థితికి చేరుకోవచ్చు

న్యాయమూర్తి మోతిలాల్ నాయక్



తెనాలిఅర్బన్: విద్యతో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేతావత్ మోతిలాల్ నాయక్ పేర్కొన్నారు. జై సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చినరావూరులోని బాలాజీ నగర్‌లో గతేడాది నిర్వహించిన 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతి రూ.మూడు వేలు, ద్వితీయ బహుమతి రూ.రెండు వేలు, తృతీయ బహుమతి రూ.1500 పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ధరావత్ ప్రసాద్‌నాయక్, బాణావత్ రాందాస్ నాయక్, తేజావత్ కన్యాభాయి, కొర్రా విజయ్, రాజానాయక్, బాలాజీనాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్



తెనాలిఅర్బన్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ ఎంతో కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ పేర్కొన్నారు. ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుర్రిపాలెం రోడ్డులోని ఎస్‌ఆర్‌ఐ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో ఉద్భవించి, పోరాటాల్లో రాటుతేలి, సమసమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నడిపిస్తున్న సంస్థ ఏఐఎస్‌ఎఫ్ అని కొనియాడారు. ఏఐఎస్‌ఎఫ్ ఏర్పడిన నాటి నుంచి అనేక ఉద్యమాలు చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చైతన్య కళాశాల ప్రిన్సిపల్ తిరుపతిరావు, ఏఐఎస్‌ఎఫ్ తెనాలి పట్టణ అధ్యక్షుడు గండు శివ, కార్యదర్శి చెన్నూరి సాయి, నాయకులు తేజ, భూమేష్, సన్నీ, గౌతమ్, యశ్వంత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణకు జాగ్రత్తలు అవసరం



తెనాలిఅర్బన్: దంతాల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని దంత వైద్యులు డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు దంత పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి డి.మురళీకృష్ణ, సంస్థ ప్రతినిధులు ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీ కృష్ణ, కొఠారి చేతన్‌రాజు, గుప్తా వెంకట రత్నం, ఎస్.వెంకటేశ్వరరావు, ఆలపాటి కిరణ్, పావులూరి రాంబాబు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్ విద్యార్థులు షేక్ హనీఫ్, ఆర్ మణిహర్ష, బాలికల విభాగంలో పెనుమూడి బ్యులా, మునిపల్లి హర్షిత ప్రియ పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ తెలిపారు. వీటిని చిత్తూరు జిల్లాలోని వి.కోటలో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించినట్లు చెప్పారు. పాల్గొన్న విద్యార్థులకు సోమవారం పాఠశాల ఆవరణలో సర్టిఫికెట్లు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన్, ఎన్‌సీసీ అధికారి సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో తెనాలికి ప్రత్యేక స్థానం

- మాజీ ఎమ్మెల్యే తెనాలి శివకుమార్
- అమరవీరులకు నివాళి



రణరంగ చౌక్‌లో తెలుగుతల్లి విగ్రహం వద్ద మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు

తెనాలిఅర్బన్: స్వాతంత్ర్యోద్యమంలో తెనాలికి ప్రత్యేక స్థానం ఉందని, ఆ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రణరంగచౌక్‌లోని క్విట్ ఇండియా ఉద్యమంలో అశువులుబాసిన వారి స్మారకార్థం నిర్మించిన స్థూపాలకు సోమవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపు ఇచ్చినప్పుడు తెనాలిలో ఏడుగురు స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటీష్‌వారి కాల్పుల్లో అశువులుబాశారని గుర్తు చేశారు. వారిని ప్రతి సంవత్సరం స్మరించుకోవడం జరుగుతుందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో తెనాలిలో జరిగిన కాల్పుల ఘటన స్వాతంత్ర్యోద్యమానికి నాంది పలికిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, కొర్ర యశోద, యాతాటి అనీల్, తోట రఘురామ్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, కఠారి హరీష్, బూరెల దుర్గా, షేక్ మీరావలి, పెదలంక వెంకటేశ్వర్లు, అత్తోట శ్యామ్, కుక్కల వాసు, తాడిబోయిన రమేష్, మల్లిబోయిన రాము, గోల్డ్ రహిమా, కుర్రా శ్రీను, అక్కిదాసు కిరణ్, దౌలాత్, గుర్రం హేమలత, రావి రాంబాబు, టెక్స్ బాల, బ్రహ్మం, కొడాలి క్రాంతి, కొల్లా గురునాథగుప్తా, గుంటూరు కృష్ణ, కోలా వాసు, కావేటి నిర్మల, కాళిదాసు సత్యం, తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపాల వద్ద నృత్యం చేస్తున్న వెస్ట్ బెర్రీ స్కూల్ విద్యార్థులు

టీడీపీ ఆధ్వర్యంలో...

అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గం ఆధ్వర్యంలో రణరంగచౌక్‌లో అమరవీరుల స్థూపాలకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆలపాటి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమంలో అశువులబాసిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనేక ఉద్యమాలకు తెనాలి పుట్టిల్లు అని చెప్పారు. ఎందరో మహానుభావులు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని తెనాలి ప్రాంత కీర్తిని మరింత ఇనుమడింపజేశారని కొనియాడారు. ముందుగా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా రణరంగచౌక్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి, అన్నం పిన్నారావు, బోయపాటి అరుణ, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, టీడీపీ నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, రమాదేవి, జొన్నాదుల మహేష్, మహ్మద్ ఖుద్దూస్, నలుకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ బెర్రి స్కూలు ఆధ్వర్యంలో...

బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూల్ ఆధ్వర్యంలో రణరంగచౌక్ వద్ద అమరవీరుల స్థూపాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని తెలియజేసే నృత్యాన్ని చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు ఫిర్యాదులు



అర్జీని తీసుకుంటున్న ఆర్‌ఓ సోమశేఖర్ యాదవ్

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు ఫిర్యాదులు వచ్చాయి. మున్సిపల్ రెవెన్యూ అధికారి సోమశేఖర్ యాదవ్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. మురుగు నీటి సమస్య పరిష్కరించాలని ఒకటి, కాల్వలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని మరో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత అధికారులకు పంపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికలో 10 అర్జీలు

తెనాలిరూరల్: తెనాలి సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 10 అర్జీలు వచ్చాయి. వీటిలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరు, పురపాలక సంఘానికి సంబంధించి రెండు, పోలీసు శాఖకు సంబంధించి ఒకటి, డీఎల్‌పీవోకు సంబంధించి మూడు ఉన్నాయి. అలానే తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. సర్వే కోసం ఒకటి, నివేశన స్థలాల పొజిషన్ చూపమని ఒకటి, మ్యుటేషన్ కోసం రెండు అర్జీలు వచ్చాయి. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

ఎంపీడీవో విష్ణుప్రసాద్‌కు సన్మానం



ఎంపీడీవో విష్ణుప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ పద్మావతి, సిబ్బంది

కొల్లిపర: ఏప్రిల్ నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా కొల్లిపర ఎంపీడీవోగా కృష్ణా జిల్లా నుంచి బదిలీపై వచ్చిన బి.వై.విష్ణుప్రసాద్ ఎన్నికల అనంతరం జరిగిన బదిలీలో తిరిగి ఆయన శనివారం కృష్ణా జిల్లాలోని రెడ్డిగూడెం వెళ్లారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, సీహెచ్ సూర్యప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది విష్ణుప్రసాద్‌ను సత్కరించారు. పలువురు ఆయనను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎంపీడీవోగా వచ్చిన విష్ణుప్రసాద్ ఆరు నెలల్లోనే తోటి ఉద్యోగులకు దగ్గర కావటంతోపాటు ప్రతి ఒక్కరి సమస్యలు తన సమస్యగా భావించి సహాయసహకారాలు అందించటం గర్వకారణం అని పేర్కొన్నారు. కొల్లిపర ఎంపీడీవో ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన విజయలక్ష్మి తిరిగి మంగళవారం విధుల్లో చేరనున్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ షైనీ

తెనాలిఅర్బన్: పుస్తక పఠనంపై అందరూ ఆసక్తిని పెంపొందించుకోవాలని జెఎంజె కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ 132వ జయంతిని పురస్కరించుకుని జెఎంజె కళాశాలలో సోమవారం జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్‌ఆర్ రంగనాథన్ దేశంలో గ్రంథాలయ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయనను ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌గా పిలుస్తారని తెలిపారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సుధాకరయ్య, విశ్రాంతమ్మ, జేనమ్మ, షకీనా, ఆర్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌ఆర్ కళాశాలలో...

వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. పుస్తక పఠనం ఆవశ్యకతను కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.రవీంద్రనాథ్, డాక్టర్ ఎస్.సుగుణ, లైబ్రరీయన్‌లు విజయసాయిరాజు, బి.వనజ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



తెనాలిరూరల్: తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలోని సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక సీమంతం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సర్వదేవ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారి జన్మదిన వేడుకల్లో భాగంగా సమితి సభ్యులు సప్త దానాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలోని గర్భిణులకు సీమంతం చేశారు. సమితి మహిళా సభ్యులు పర్యవేక్షించారు.

పేదలకు న్యాయ సేవలు ఉచితం



దావులూరు(కొల్లిపర): సమాజంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడు న్యాయసేవలు ఉచితంగా పొందవచ్చని తెనాలి మండల న్యాయసేవా అధికార సంస్థ ప్యానెల్ న్యాయవాది రావూరి దయకిరణ్ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి డి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం మండలంలోని దావులూరు గ్రామంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దయకిరణ్ మాట్లాడుతూ వితంతు పింఛన్‌కు అర్హత ఉండి ఎన్నిసార్లు అధికారుల వద్దకు వెళ్లినా రానివారు ఉంటే అటువంటి వారు న్యాయసేవాధికార సంస్థకు అర్జీ అందిస్తే వారికి అండగా ఉండి మీ తరుపున సంబంధిత శాఖ అధికారులకు పంపించి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు నాగమణి, పంచాయతీ సిబ్బంది, వితంతువులు, వృద్ధులు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన రామిశెట్టి లక్ష్మమ్మ(80) ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు రాగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించగా మృతి చెందింది. వైద్యశాల నుంచి సోమవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమవారం రాత్రి తెలిపారు.

వైద్యురాలిపై లైంగికదాడి కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి, పక్కన వైద్యులు

తెనాలిరూరల్: కోల్‌కత్తాలో వైద్యురాలిపై లైంగికదాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. స్థానిక బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. కోల్‌కత్తా నగరంలో గల ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో యువ వైద్యురాలిపై కళాశాల సెక్యూరిటీ గార్డు అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసిన సంఘటన ఎంతో దారుణమని ఐఎంఏ తెనాలి శాఖ వైద్యులు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ సంఘటనను ప్రత్యేకంగా తీసుకొని ఈ అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మనిషి ప్రాణాలు రక్షించే వైద్యులపై ఇలాంటి సంఘటనలు జరగటం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వాలు ఇటువంటి వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. సమావేశంలో వైద్యులు కొత్తమాసు శ్యాంప్రసాద్, చందు సాంబశివుడు, జి. మధుబాబు, సుబ్బారావు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎంపీపీ పద్మావతి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు తీసుకోవటం వలన మత్తులో మానవత్వం మరిచి నేరాలకు పాల్పడుతున్నారని, దీనితో వారి జీవితం చిన్న వయసులోని అంధకారంగా మారుతుందని, యువత, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని, అప్పుడే వారు మంచి పౌరులుగా ఎదుగుతారని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. నశా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి అంటూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవటం వలన మొదట్లో ఆనందం కలుగుతుందని, ఆ తర్వాత ఆలోచన శక్తి క్షీణించి ఆ సమయంలో ఏది అనిపిస్తే అది చేసి చివరికి నేరస్తులుగా సమాజం ముందు నిలబడతారని అన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ జయంతిబాబు

తెనాలిఅర్బన్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎంఈవో–2 జయంతిబాబు సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గంగానమ్మపేటలోని టీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలను తెలియజేశారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసన్నత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- అమరవీరులకు నివాళి



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ నాగవేణి

తెనాలిరూరల్: అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. తెనాలిలో 1942 ఆగస్టు 1వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా జరిగిన పోరాటంలో మృతి చెందిన ఏడుగురు అమరవీరులకు సోమవారం శ్రద్ధాంజలి ఘటించారు. తెనాలి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన వీరసంస్మరణ దినోత్సవంలో భాగంగా ఇక్కడి రణరంగచౌక్ లోని అమరవీరుల స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరులకు జోహార్లు అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలరు పేరం సంజీవరెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. తొలుత మాజీ సైనికులు, ఎన్‌సీసీ క్యాడెట్లు కవాతుతో పాత గవర్నమెంట్ హాస్పటల్ వద్ద నుంచి రణరంగచౌక్‌కు వచ్చారు. దారి మధ్యలో మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగిన బహిరంగ సభలో అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల త్యాగాల వల్ల స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఆనాటి త్యాగమూర్తులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వివిధ రంగాల ప్రముఖులను సత్కరించారు. రణరంగ చౌక్ అమరవీరుల కుటుంబసభ్యులు ములుగు శివకుమార్, గాలి భుజంగరావులను పురపాలక సంఘం తరపున సత్కరించారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన కన్నెగంటి సీతారామయ్య, ఎస్ రాంబాబు, కట్టా వెంకటేశ్వర్లు, షేక్ నూర్జహాన్, డాక్టర్ డి శారద, వేజళ్ల ఉమామహేశ్వర్, సున్నపురెడ్డి వీరాంజనేయులు, షేక్ షబీనా తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గొడవర్తి సాయి హరేరామ్, గుంటూరు కోటేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, అసిస్టెంట్ కమిషనర్ అనూష, హెల్త్ ఆఫీసర్ కెహెచ్ నిర్మల, సిటీ ప్లానర్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఎంపీపీ పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: గ్రామాలలో పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధి దీపాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చర్యలు చేపట్టినప్పుడే ఆ గ్రామం అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తుందని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణలో భాంగంగా శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ, వీధిదీపాలు పలు అంశాలపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు బుధవారం వరకు జరుగుతాయి, శిక్షణ తరగతులకు కార్యదర్శులు, సర్పంచ్‌లు పూర్తిస్థాయిలో పాల్గొని ఉన్నత అధికారులు తెలియజేస్తున్న విషయాలను క్షుణంగా తెలుసుకుని ఆచరించాలని సూచించారు. మొదటి రోజు వచ్చిన శిక్షణ అధికారులు పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వేస్ట్ కలెక్షన్ ప్రాసెస్, వర్మీ కంపోస్ట్ మార్కెటింగ్ విధానాలు, ఎస్‌హెచ్‌జి సభ్యుల భాగస్వామ్యం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, థీమాటికల్ అప్రోచ్ నేపథ్యంలో జి.పి.డి.పి ప్రాసెస్ చేయు విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్, ఈవోపీఆర్డీ పూర్ణశంకరావు, వివిధ గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

గుంటూరు మెడికల్: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థిని హత్యను ఖండిస్తూ సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ జూనియర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు కొవ్వొత్తులు, ప్లకార్డులు చేతపట్టుకొని జీజీహెచ్ చుట్టూ నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. మంగళవారం అత్యవసర వైద్య సేవలు మినహా సాధారణ వైద్య సేవల్ని నిలిపి వేస్తున్నట్లు జూనియర్ డాక్టర్స్ సంఘం నేతలు తెలిపారు. ఈ మేరకు గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు.

హిందువులపై దమనకాండను అరికట్టాలి



తెనాలిరూరల్: బంగ్లాదేశ్‌లో హిందువుల మీద జరుగుతున్న దమనకాండను అరికట్టాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందు ఆలయాలు, కృష్ణ, కాళీ మందిరాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, హిందువులు సోమవారం సాయంత్రం పట్టణంలో కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సెంటర్ నుంచి శివాజీ చౌక్ వరకు జరిగిన ర్యాలీలో అవ్వారు శ్రీనివాసరావు, అడపా సంపత్‌రాయుడు, పాటిబండ్ల రామకృష్ణ, అంబటి మారుతీరామ్, కొల్లూరు సత్యనారాయణ, గాజుల వెంకయ్యనాయుడు, మైలా హరికృష్ణ, పుల్లగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. హిందూ చైతన్య వేదిక సభ్యులు పర్యవేక్షించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులంతా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ తెలిపారు. పట్టాభిపురంలోని నగర పాలకసంస్థ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఆమె సందర్శించారు. విద్యార్థులతో నిషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుట్కా, పాన్‌పరాగ్ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని తెలిపారు. మాదక ద్రవ్యాల్ని సేవించడం ద్వారా క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు తమ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో అందరినీ చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని చెప్పారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.